ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



వికారాబాద్ - మేడ్చల్

జిల్లాల వార్తలు

5

మంగళవారం 16 సెప్టెంబరు 2025



ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

ప్రజావాణికి 103 ఫిర్యాదులు

» వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 103 ఫిర్యాదులు, అర్జీలు వచ్చినట్లు కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులు పెండింగ్‌లో ఉంచకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ట్రైనీ కలెక్టర్ హర్ష్‌చౌదరి, డీఆర్వో మంగ్లీలాల్, ఆర్డీవో వాసుచంద్ర, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

అర్హులందరికీ పెన్షన్లు ఇవ్వాలి

» కలెక్టరేట్ ఎదుట సీపీఎం నాయకుల ధర్నా

మేడ్చల్, సెప్టెంబర్ 15(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అర్హులైన వారందరికీ కొత్త పెన్షన్లు ఇవ్వాలని, అలాగే దివ్యాంగ పెన్షన్‌ను రూ.6 వేలకు పెంచాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు భాస్కర్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఒకటిన్నర సంవత్సరాలు పూర్తయినా ఇప్పటి వరకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. జిల్లాలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నారన్నారు. ఇప్పటికైనా కొత్త పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సత్యం, ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్, నాయకులు శ్రీనివాస్, రాథోడ్ సంతోష్, లింగస్వామి, నరేష్, లక్ష్మణ్, సబిత, ఎం.శంకర్, గణేష్, మంగ, స్వామి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



ఇంటి నుంచి బాక్స్ తెచ్చుకొని తింటున్న విద్యార్థినులు (ఫైల్)

మధ్యాహ్న భోజనం ఉత్తిమాటేనా?

జూనియర్, డిగ్రీ కళాశాలల్లో అమలుకాని పథకం

ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు మధ్యాహ్న భోజనానికి నోచుకోవడం లేదు. పాఠశాలల్లో అమలు చేస్తున్న మాదిరిగానే కళాశాల్లోనూ చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలనే డిమాండ్ చాలా కాలంగా ఉంది. ప్రభుత్వాలు మారుతున్నా అమలుకు నోచుకోవడం లేదు. జిల్లాలో 13 ప్రభుత్వ జూనియర్, తొమ్మిది మోడల్ కళాశాలలు, నాలుగు ప్రభుత్వ, రెండు ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలు, ప్రభుత్వ పాలిటెక్నిక్, ప్రభుత్వ డైట్, నాలుగు ప్రభుత్వ ఐటీఐ/ఐటీసీ కళాశాలలు ఉన్నాయి. ఈ కళాశాలల్లో 10 వేల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు.

- ఆకలితో అలమటిస్తున్న విద్యార్థులు
- అటకెక్కిన గత ప్రభుత్వం హామీ
- అమలైతే 10 వేల మందికి ప్రయోజనం
- అమలు చేయాలని విద్యార్థుల విన్నపం

వికారాబాద్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గ్రామీణ ప్రాంతాల నుంచి చదువుల కోసం మండల, నియోజకవర్గ కేంద్రాలకు వచ్చే విద్యార్థులు మధ్యాహ్నం భోజనానికి నోచుకోవడం లేదు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగుతున్నాయి. కళాశాలలకు వచ్చేప్పుడు విద్యార్థుల్లో కొందరు భోజనం చేసి మధ్యాహ్నానికి లంచ్ బాక్సు తీసుకుని వస్తుండగా, మరికొందరు ఉదయం తమ ఇళ్ల వద్ద భోజనం చేసి వస్తున్నారు. బాక్సు తెచ్చుకోని విద్యార్థులు కళాశాల ముగిసే వరకు ఆకలితోనే అలమటిస్తున్నారు. మధ్యాహ్నం భోజనం చేయక ఆకలికి

మిగతా 8వ పేజీలో...



లంచ్ బాక్సు తెచ్చుకోకపోతే పస్తులే...



మాలో కొందరు ఉదయం తమ ఇళ్ల నుంచి వచ్చేప్పుడు భోజనం చేసి వస్తుండగా, మరికొందరు బ్రేక్‌ఫాస్ట్ చేసి లంచ్‌బాక్సు తెచ్చుకుంటున్నారు. మధ్యాహ్నం లంచ్‌బాక్సు తెచ్చుకోలేని కొందరు సమోసా, టీ వంటి వాటితో సరిపెట్టుకుంటున్నారు. డబ్బులు లేని వారు పస్తులతోనే గడిపేస్తున్నారు. కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజనం అమలు చేస్తే పేద విద్యార్థులకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది.

-శ్రేయాస్, బైపీసీ, ఇంటర్ ఫస్టియర్, నవాబ్‌పేట్ ప్రభుత్వ జూనియర్ కళాశాల



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ నారాయణ రెడ్డి

జిల్లాలో తగ్గిన నేరాలు

» ఎస్పీ నారాయణరెడ్డి

ధారూరు, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): గతంలో నేరాలకు పాల్పడిన నిందితులకు న్యాయస్థానాలలో కఠిన శిక్షలు పడేలా పోలీసు అధికారులు పని చేయడంతో నేరాల సంఖ్య తగ్గిందని ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన ధారూరు పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను పరిశీలించి స్టేషన్ ఆవరణలో మొక్కనాటి నీళ్లు పోశారు. అనంతరం సిబ్బంది గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ క్రైమ్‌పై గ్రామాలలో కళాజాత ద్వారా అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి సారించామని వివరించారు. జిల్లాలో నేరాలు కట్టడి చేశామని, హత్య కేసులను ఛేదించి నిందితులను పట్టుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, సీఐ రఘురాం, ఎస్ఐ రాఘవేందర్‌లు పాల్గొన్నారు.

పాత అలైన్మెంట్ ప్రకారమే ట్రిపుల్‌ఆర్ నిర్మించాలి



క్యాంప్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతులు

వికారాబాద్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ట్రిపుల్ ఆర్‌ను పాత అలైన్‌మెంట్ ప్రకారమే ఏర్పాటు చేయాలని రైతులు అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని వారు ముట్టడించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. నాయకుల స్వార్థం కోసం కొత్త అలైన్మెంట్ తెచ్చారని మండిపడ్డారు. పాత అలైన్మెంట్ ప్రకారం రోడ్డు వేయకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

బతుకమ్మ చీరలు రెడీ

- ఒక్కో మహిళకు రెండు చొప్పున.. డ్వాక్రా సంఘాల వారీగా అందజేత
- జిల్లాలో 3.46లక్షల మంది సభ్యులు.. ప్రత్యేకంగా నాలుగు డిజైన్ల ఎంపిక
- ఇప్పటికే జిల్లాకు చేరుకున్న చేనేత చీరలు





డ్వాక్రా మహిళలకు పంపిణీ చేయనున్న బతుకమ్మ చీరలు

మేడ్చల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బతుకమ్మ పండుగ సందర్భంగా డ్వాక్రా మహిళల్లో ఆనందం నింపేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బతుకమ్మ పండుగకు 18 సంవత్సరాలు నిండిన ప్రతీ మహిళలకు ఉచితంగా చీరలు పంపిణీ చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సైతం 'ఇందిరా మహిళా శక్తి' పేరిట డ్వాక్రా మహిళలకు చీరలు పంపిణీ చేసేందుకు సిద్ధమవుతోంది. 'అక్కా-చెల్లెళ్లకు మీ రేవంతన్న కానుక' పేరుతో డ్వాక్రా గ్రూపులో సభ్యురాలైన ప్రతీ ఒక్కరికి రెండేసి చీరల చొప్పున అందించనున్నారు. చేనేత చీరలను పంపిణీ చేసేందుకు యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 21వ తేదీ నుంచి బతుకమ్మ పండుగ సంబరాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో త్వరలోనే మహిళలకు చీరలు పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే మేడ్చల్ - మల్కాజిగిరి పంపిణీ చేయాల్సిన చీరలు జిల్లాకు

మిగతా 8వ పేజీలో...

మేడ్చల్ జిల్లాలోని డ్వాక్రా సంఘాల వివరాలు

	సంఘాలు	సభ్యులు
సెర్ప్	3,847	42,804
మెప్మా	9,890	96,188
జీహెచ్ఎంసీ	20,602	2,07,932
మొత్తం	34,339	3,46,924

తండాలో సమస్యలు పరిష్కరించండి

» ఎస్టీ జాతీయ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్

» త్వరలోనే పరిష్కరిస్తామని కలెక్టర్ మను చౌదరి భరోసా



తండాలో పర్యటిస్తున్న హుస్సేన్‌నాయక్, కలెక్టర్ మనుచౌదరి

శామీర్‌పేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సేవలాల్ తండాలో తాగునీరు, రోడ్లు, శ్మశానవాటిక, అంగన్‌వాడీ కేంద్రం, కమ్యూనిటీ హాల్ వంటి మౌలిక వసతులను కల్పించి, సమస్యలను పరిష్కరించాలని ఎస్టీ జాతీయ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్ కలెక్టర్‌ను కోరారు. సోమవారం ఆయన కలెక్టర్ మను చౌదరితో కలిసి శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాలిటీ దేవరయాంజాల్ పరిధిలోని సేవాలాల్ తండాకు వెళ్లి అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హుస్సేన్‌నాయక్ మాట్లాడుతూ పేద, నిరుపేదలకు ఎంతో గొప్ప తపనతో కలెక్టర్ మను చౌదరి ఉత్తమ సేవలందిస్తున్నారని ఆయన అభినందించారు. దేవాదాయ భూములలో ఏళ్లుగా గుడిసెలు వేసుకుని ఎన్నో సమస్యలను ఎదుర్కొంటూ ఇక్కడే నివాసముంటున్న నిరుపేదలకు పట్టా భూములను అందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ సమస్యలను తాను ప్రత్యక్షంగా పరిశీలించానని, త్వరలోనే అన్నింటిని పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. సంబంధిత శాఖల సమన్వయంతో పట్టా భూములకు సంబంధించి చర్చించి ప్రభుత్వానికి నివేదికను అందజేస్తానని వెల్లడించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ అనిత, ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి, తహసీల్దార్ యాదగిరి రెడ్డి, జిల్లా మైనార్టీ అధికారి పద్మజా, మున్సిపల్ కమిషనర్ జ్యోతి, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఆ గ్రామంలో అంతా బీసీ ఓటర్లే



కొడంగల్ రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లక్ష్మీపల్లి గ్రామం 1996లో పంచాయతీగా ఏర్పడింది. గతంలో ఈ పంచాయతీలో సంగాయిపల్లి కలిసి ఉండేది. గత ప్రభుత్వ హయాంలో నూతన పంచాయతీల ఏర్పాటుతో సంగాయిపల్లి విడిపోయింది. ప్రస్తుతం లక్ష్మీపల్లి గ్రామంలో ఇటీవల అధికారులు ప్రకటించిన ఓటరు జాబితా ప్రకారం 687 మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు 343, మహిళలు 344 మంది ఉన్నారు. వీరంతా బీసీ వర్గానికి చెందిన వారే కావడం గమనార్హం. ఇతరులు ఎవరూ గ్రామంలో లేకపోవడంతో పంచాయతీ ఎన్నికల్లో ఈ వర్గానికి చెందిన మహిళ లేదా పురుషుడు మాత్రమే ప్రతీ ఎన్నికల్లోనూ సర్పంచ్, వార్డు సభ్యులుగా ఎన్నిక అవుతున్నారు.

జిల్లాకు 120 మెట్రిక్ టన్నుల యూరియా

» జిల్లా వ్యవసాయాధికారి రాజారత్నం



తాండూరులోని ఫర్టిలైజర్ షాపులో తనిఖీ చేస్తున్న రాజారత్నం

తాండూరు రూరల్/పెద్దేముల్/కోట్‌పల్లి, సెప్టెంబరు 15, (ఆంధ్రజ్యోతి): నేడు జిల్లాకు 120 మెట్రిక్ టన్నుల యూరియా రానుందని జిల్లా వ్యవసాయాధికారి రాజారత్నం తెలిపారు. సోమవారం తాండూరు మండలంలోని ఎల్మకన్నె పీఏసీఎస్ కార్యాలయం, పెద్దేముల్, తాండూరు పట్టణంలోని ఫర్టిలైజర్ షాపులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరికీ యూరియా అందుతుందని తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో 22,981 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా జరిగిందన్నారు. నేడు జిల్లాలోని సొసైటీలు, ఆగ్రో కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉంటుందని, రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని అన్నారు. అలాగే జిల్లాలో 620 లీటర్ల నానో యూరియా కూడా రైతులకు అందుబాటులో ఉందన్నారు.ఆయన వెంట తాండూరు వ్యవసాయాధికారి కొమరయ్య, పెద్దేముల్ ఏవో పవన్ ప్రీతం పాల్గొన్నారు.

నానో యూరియాతో దిగుబడి అధికం

నానోయూరియా ఉపయోగించి తక్కువ వ్యయంతో ఎక్కువ దిగుబడి సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి రాజారత్నం పేర్కొన్నారు. పెద్దేముల్ రైతుసేవ సహకార సంఘంలో యూరియా కోసం వచ్చిన రైతులకు ఆయన నానో యూరియాపై అవగాహన కల్పించారు. అలాగే కోట్‌పల్లి మండల కేంద్రంలోని చందనగిరికోటలో యూరియా పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. రైతులు అడిగిన విధంగా, వచ్చే ఇండెంట్ నుంచి 20 టన్నులు వచ్చేలా కృషి చేస్తామన్నారు. నానో యూరియా కొన్న రైతులకు ప్రమాద బీమా వర్తిస్తుందని గుర్తు చేశారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి కర్ణాకర్ రెడ్డి, విస్తరణ అధికారి సందీప్, అధ్యక్షులు శ్రీను, వివిధ గ్రామాల రైతులు ఉన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, జిల్లా అధికారులు

ఎస్ఐఆర్ నిర్వహణకు సిద్ధంగా ఉండాలి

» రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

వికారాబాద్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్పెషల్ ఇన్వెంటివ్ రివిజన్ (ఎస్ఐఆర్) నిర్వహణకు అధికారులు సన్నద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. స్పెషల్ ఇన్వెంటివ్ రివిజన్ 2002పై కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో డూప్లికేట్ ఓట్లు, దొంగ ఓట్ల తొలగింపుకు 20 నుంచి 25 సంవత్సరాలకు ఒక సారి స్పెషల్ ఇన్వెంటివ్ రివిజన్ చేయడం జరుగుతుందన్నారు. ఎస్ఐఆర్ నిర్వహణపై మాస్టర్ ట్రైయినర్ల ద్వారా బూత్ స్థాయి సిబ్బందికి సంపూర్ణ అవగాహన కల్పించాలని అన్నారు. ఎస్ఐఆర్ నిర్వహణ కంటే ముందు ప్రతీ పోలింగ్ బూత్ స్థాయిలో 2002 ఎస్ఐఆర్ డేటాను 2025 ఎస్ఎస్ఆర్ డేటాతో కంపేర్ చేసుకోవాలన్నారు. బీఎల్ఓ దగ్గర 2002 ఎస్ఐఆర్ 2025 ఎస్ఎస్ఆర్ హార్డ్ కాపీలు ఉండాలని, ఈ రెండు జాబితాలలో కామన్‌గా ఉన్న పేర్లు మినహాయించి 2002 తరువాత ఓటరుగా నమోదైన వారి వివరాలను క్షేత్రస్థాయిలో మరోసారి ధ్రువీకరించాల్సి ఉంటుందని అన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వికారాబాద్ జిల్లాలో 2002 ఓటరు జాబితాను 2025 ఓటరు జాబితాతో సరి చూసుకొని త్వరగా మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని ఈఆర్‌ఓలను ఆదేశించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ట్రైనీ కలెక్టర్ హర్ష్‌చౌదరి, డీఆర్వో మంగ్లీలాల్, ఆర్డీవో వాసుచంద్ర, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నెమత్ హాలీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినితో వైస్ ప్రిన్సిపాల్ అసభ్య ప్రవర్తన

» చితకబాదిన తల్లిదండ్రులు

తాండూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఓ విద్యార్థిని పట్ల స్కూల్ వైస్ ప్రిన్సిపల్ అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు ఆమెను స్కేల్‌తో కొట్టాడు. ఈ ఘటన తాండూరు పట్టణంలోని సెయింట్ మార్క్స్ హైస్కూల్‌లో జరిగింది. విషయం తెలుసుకున్న విద్యార్థిని తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లి నిలదీయడంతో పాటు చితకబాదినట్లు సమాచారం. దీంతో స్కూల్ యాజమాన్యం వైస్ ప్రిన్సిపాల్ బాలస్వామిని పాఠశాల నుంచి తొలగించింది. ప్రిన్సిపాల్ ఆరోగ్యరెడ్డిని వివరణ కోరగా తన నోటీస్‌కి రావడంతో తక్షణమే అతన్ని ఉద్యోగం నుంచి తొలగించినట్లు తెలిపారు. 4 రోజుల క్రితం జరిగిన ఈ ఘటనను బయటికి పొక్కకుండా పాఠశాల యజమాన్యం జాగ్రత్త పడింది. ఈ విషయం సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి రావడంతో పలు విద్యార్థి సంఘాల నాయకులు స్కూల్‌కు వెళ్లి ప్రిన్సిపాల్‌ను నిలదీశారు. కాగా, విద్యార్థిని తల్లిదండ్రులు అటు విద్యాశాఖ అధికారికి గాను, పోలీసులకు గాని ఫిర్యాదు ఇవ్వలేదు. కొంతమంది ఈ వ్యవహారాన్ని గోప్యంగా ఉంచేందుకు పాఠశాలకు వెళ్లి డబ్బులు డిమాండ్ చేసి తీసుకున్నట్లు సమాచారం.



తూంకుంట జలమయం

- కాలనీలు, లోతట్టు ప్రాంతాల్లో భారీగా వరద
- చెరువులను తలపించిన రాజీవ్ హైవే, ఇతర రోడ్లు

7







అంగన్‌వాడీల సమస్యలపై గళమెత్తుతా


ఎమ్మెల్యే సబితారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు


మహేశ్వరం/కందుకూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్‌వాడీలను నిర్వీర్యం చేయాలని చూస్తోందని, తాను అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలపై అసెంబ్లీలో లేవనెత్తుతానని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. సోమవారం ఐసీడీఎస్ మహేశ్వరం ప్రాజెక్టు పరిధి అంగన్‌వాడీ టీచర్లు తమ సమస్యలపై ఎమ్మెల్యేను క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం ఇచ్చా రు. వారితో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో ముఖ్యమంత్రి కేసీఆర్ అంగన్‌వాడీలకు అధిక ప్రాధాన్యం కల్పించారని, కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా మార్చే ప్రయత్నం చేస్తోందన్నారు. అంగన్‌వాడీ సమస్యలపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీసి న్యాయం చేయిస్తానని సబితారెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శ్రీనివాస్, కవిత, శేఖర్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థను భ్రష్టుపట్టించిన కాంగ్రెస్

కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో విద్యా భ్రష్టు పట్టించిందని, ఏ పాఠశాలకు వెళ్లినా వసతులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. తుక్కుగూడ మున్సిపాలిటీ హర్షగూడ పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. పాఠశాలలో టాయిలెట్స్ తదితర సమస్యలు ఉన్నాయని విద్యార్థులు ఎమ్మెల్యేకు చెప్పారు. ఆమె డీఈవో ఫోన్లో మాట్లాడి పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఉపాధ్యాయు ల కొరత, విద్యా బోధన వంటి సమస్యలపై ఆమె ఆరా తీశారు. టీచర్లు ఎలా బోధిస్తున్నారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట మాజీ కౌన్సిలర్ రాజునాయక్, మాజీ ఉపసర్పంచ్ రవి ఉన్నారు.







హైటెన్షన్ లైన్ మార్చే వరకు రిలే దీక్షలు


దీక్షలో కూర్చున్న భూ నిర్వాసితులు

కడ్తాల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పంట పొలాల మీదుగా నిర్మిస్తున్న 765 హైటెన్షన్ విద్యుత్ టవర్ల పనులను నిలిపేసి అలైన్‌మెంట్‌ను మార్చాలని కడ్తాలలో రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం 8వ రోజుకు చేరాయి. నిర్వాసితులకు రాజకీయ నాయకులు సంఘీబావం ప్రకటించారు. దీక్షలో నిర్వాసితులు శంకర్, కృష్ణజంగయ్య, కాలె వెంకటేశ్, లక్ష్మీనారాయణ కూర్చున్నారు. రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, బీజేపీ నాయకుడు రమేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రామకృష్ణ దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు ప్రకటించారు. వారు మాట్లాడుతూ అనుమతి లేకుండా లైన్ నిర్మాణం అన్యాయమన్నారు. వ్యాపారవేత్తల ఒత్తిళ్లతో అలైన్మెంట్ మార్చి కడ్తాల మీదుగా వేస్తున్నారని మండిపడ్డారు. తాము భూములు ఇవ్వం అని స్పష్టం చేశారు. పెంటారెడ్డి, పర్వతకుమార్, రాములు, రాజేందర్ పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరించిన విద్యాసాగర్‌రావు


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు తదితరులు

పరిగి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పరిగికి చెందిన రచయిత డాక్టర్ పి.భాస్కరయోగి రచించిన 'సెప్టెంబరు 17-ముమ్మాటికి విమోచనే' అనే పుస్తకాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్.విద్యాసాగర్‌రావు చేతుల మీదుగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆవిష్కరించారు. విమోచనపై కొత్త కోణంలో రచించిన భాస్కరయోగిని పలువురు అభినందించారు. భాస్కరయోగి మాట్లాడుతూ.. తెలంగాణ వారసత్వం అంటే ప్రతాపరుద్రుడు మొదలు అక్కన్న, మాదన్నల వారసత్వమని పేర్కొన్నారు. తెలంగాణకు స్వాతంత్ర్యం వచ్చింది సెప్టెంబరు 17న అని నేటి సమాజానికి తెలియాలంటే, నాటి పోరాటాన్ని వివరించాల్సిందేనన్నారు. పుస్తకావిష్కరణలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, నాయకులు శ్రీవర్ధన్‌రెడ్డి, కరుణ, విక్రమ్‌రెడ్డి, శ్యాంసుందర్‌గౌడ్, మధుసూధన్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు అంచున కొట్టుకుపోయిన మట్టి: పొంచి ఉన్న ప్రమాదం

● వాహనదారుల ఇబ్బందులు


చేగిరెడ్డి ఘణాపూర్ శివారులో రోడ్డు అంచున కొట్టుకుపోయిన మట్టి

చౌదరిగూడ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఇటీవలి వర్షాలకు కొత్తగా వేసిన బీటీ రోడ్డు అంచులకు మట్టి కొట్టుకుపోయి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. చేగిరెడ్డి ఘణపూర్‌లో కొన్ని రోజుల క్రితం బీటీ రోడ్డు వేశారు. కొద్ది రోజులకే రోడ్డుపక్కన మట్టి కొట్టుకుపోయి వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. పద్మారం-చౌదరిగూడ రోడ్డు మూల మలుపులో కల్వర్టు కుంగి భారీ గుంత ఏర్పడింది. జిల్లేడ్ శివారులో రోడ్డు మధ్యలో వదిలిన సీసీ రోడ్డు పనులు చేయాల్సి ఉంది. ఈ రోడ్డుపై పెద్దఎల్కిచర్ల, వీరన్నపేట్ మీదుగా చౌదరిగూడకు రాకపోకలు సాగిస్తుంటారు. గతంలో రోడ్డుపై పడిన గుంతలో కారు పడి ప్రమాదం జరిగింది. అధికారులు చొరవ తీసుకుని ఈ రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రయాణికులు కోరుతున్నారు.


పద్మారంలో కొట్టుకుపోయిన రోడ్డు మట్టి

రోడ్డుకు మట్టి పోయించాలి



ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుకు ఇరువైపులా మట్టి కొట్టుకుపోయింది. దీంతో రోడ్డు అంచుల వద్ద వాహనదారులకు ముప్పు పొంచి ఉంది. ఏ మాత్రం సైడ్లకు వెళ్లినా అదుపుతప్పి పడిపోయే ఆస్కారం ఉంది. రాత్రి పూట వెళ్లేవారికి మరింత డేంజర్‌గా మారింది. ఇప్పటికే కొందరు వాహనదారులు పట్టుతప్పి రోడ్డు కిందికి దూరుకుపోయారు. వెంటనే మట్టి పోయించాలి.

- కారుకొండ బాల్‌రాజ్, చెన్నారెడ్డిగూడ





పాత అలైన్‌మెంట్‌నే కొనసాగించాలి


ఆర్డీవోకు వినతి పత్రం ఇస్తున్న రైతులు

వికారాబాద్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ట్రిపుల్‌ఆర్‌కు సంబంధించి పాత అలైన్‌మెంట్‌నే కొనసాగించాలని నవాబుపేట రైతులు ధర్నా నిర్వహించారు. వికారాబాద్ ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం రైతులు నినాదాలు చేశారు. వీరికి బీఆర్ఎస్, బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. నాయకులు భూములు, వెంచర్ల కోసమే ట్రిపుల్ ఆర్ పాత అలైన్మెంట్‌ను మార్చారని రైతులు ఆరోపించారు. పాత రూట్ ప్రకారమే రోడ్డు వేయాలని విజ్ఞప్తి చేశారు. లేదంటే ఆందోలనలు చేస్తామని హెచ్చరించారు. శుభప్రద్, వడ్లనందు పాల్గొన్నారు.

పనులకు అడ్డుగా ఉన్న నిర్మాణాల కూల్చివేత


ఘట్‌కేసర్‌లో రైల్వే బ్రిడ్జి పక్కన రేకుల షెడ్ల కూల్చివేత

ఘట్‌కేసర్, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్‌లోని రైల్వే వంతెనకు అడ్డుగా ఉన్న నిర్మాణాలను సోమవారం నాయకులు నిర్వాసితులతో కలిసి కూల్చివేయించారు. మునిసిపల్ కాంగ్రెస్ నాయకులు ముల్లి జంగయ్యయాదవ్, మహేష్‌గౌడ్, ఆంజనేయులు, మల్లేష్ ఆధ్వర్యంలో కూల్చివేతలు చేపట్టారు. పరిహారం కోసం ఇళ్ల యజమానులు కోర్టు ఆశ్రయించడంతో బ్రిడ్జి పనులు నిలిచాయి. దీంతో రెండు సంవత్సరాలుగా ఘట్‌కేసర్‌కు బస్సులు రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత వారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో బాధితలతో మాట్లాడి ఒప్పించి కూల్చివేతలు, పనులు చేపడుతున్నారు. సోమవారం మరోపక్క కొన్ని ఇళ్లను కూల్చివేయించారు. శిథిలాల తొలగింపుతో వాహనాల రాకపోకలు సాగిస్తున్నాయి. వంతెన నిర్మాణాన్ని అధికారులు త్వరగా పూర్తిచేయించి బస్సుల రాకపోకలను పునరుద్ధరించాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

సీతాఫలాల అమ్మకాలు షురూ..



చౌడాపూర్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కన్మన్‌కాల్వ, కొత్తపల్లి, పుర్సంపల్లి, మల్కాపూర్ గ్రామాల పరిధి అటవీ ప్రాంతాల్లో సీతాఫల చెట్లు ఉండడంతో వాటిని అమ్ముతూ ప్రజలు ఉపాధి పొందుతున్నారు. అటవీ ప్రాంతంలో సీతాఫల కాయల సేకరణకు అటవీ శాఖ వేలం నిర్వహిస్తోంది. వీటి అమ్మకాలతో రెండు, మూడు నెలల పాటు కూలీలు ఉపాధి పొందుతున్నారు. మహ్మదాబాద్ రేంజ్ కింద ఇటీవల వేలంలో రూ.7.7లక్షలకు ఓ వ్యక్తి దక్కించుకున్నాడు. వేలం ఆదాయంలో 50శాతం గ్రామాల అభివృద్ధికి వినియోగించనున్నారు. మిగతా డబ్బును అటవీ శాఖ అవసరాలకు వెచ్చిస్తారు. ఈ ప్రాంతంలో లభిస్తున్న సీతాఫలాలను హైదరాబాద్, మిర్యాలగూడ, కోదాడ, విజయవాడ, రాజమండ్రి, విజయనగరం, ఒంగోలు,గుంటూరు ప్రాంత వ్యాపారులొచ్చి కొనుగోలు చేస్తున్నారు. కాగా సీతాఫలాల అమ్మకానికి స్థానికంగా మార్కెట్లు ఏర్పాటు చేయాలని కూలీలు కోరుతున్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కొండ విజయ్‌కుమార్

సమాజంలో వెలుగు నింపేది ఉపాధ్యాయులే

షాబాద్, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): సమాజంలో అజ్ఞాన అంధకారాన్ని పారదోలి వెలుగులు నిపేది ఉపాధ్యాయులని, వారు పవిత్ర వృత్తికి న్యాయం చేస్తేనే అభివృద్ధి సాధ్యం అని రాష్ట్ర హాకీ ఫెడరేషన్ చైర్మన్, హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం షాబాద్‌లోని బాలుర పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్, ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు మనకు జన్మనిస్తే ఉపాధ్యాయులు విద్యాబుద్ధులు నేర్పుతారన్నారు. విద్యార్థి క్రమశిక్షణతో విద్యను పూర్తిచేసుకొని సముచిత స్థానంలో స్థిరపడినప్పుడే తల్లిదండ్రుల, గురువుల శ్రమకు ఫలితం దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, హెచ్ఎం బాల్‌రాజ్, టీచర్లు సుశీల, కృష్ణయ్య పాల్గొన్నారు.

అండర్ పాస్ పనులను పూర్తి చేయాలి

షాద్‌నగర్ రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): బూర్గుల రైల్వే అండర్ పాస్ పనులను త్వరగా పూర్తిచేయాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు డిమాండ్ చేశారు. ఫరూఖ్‌నగర్ మండలం బూర్గుల రైల్వే అండర్ పాస్ పనులను సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ... మూడేళ్లుగా పనులు నత్తనడకన సాగుతున్నాయని తెలిపారు. పనులు త్వరగా పూర్తికాక ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులను అడిగితే పొంతనలేని సమాధానాలు చెబుతున్నారని వాపోయారు. బూర్గుల రైల్వేగేట్ మీదుగా 12గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారని చెప్పారు. మూడు నెలల నుంచి పనులు కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పనుల్లో నాణ్యత లోపం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విన్‌వైష్ణవ్ దృష్టికి తీసుకెళ్లేందుకు లేఖ రాస్తానని చెప్పారు. ఆయన వెంట టీడీపీ నాయకుడు కుమార్‌గౌడ్ ఉన్నారు.

రోడ్డు విస్తరణకు చెట్ల తొలగింపు

బషీరాబాద్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): హరితహారం కింద పెంచిన చెట్లు కనుమరుగవుతున్నాయి. రోడ్డు విస్తరణలో చెట్లను తొలగిస్తున్నారు. బషీరాబాద్-లక్ష్మీనారాయణపూర్ మధ్య 16.8కిలోమీటర్ల డబుల్ రోడ్డును ఫోర్‌లేన్ పనులు చేపట్టారు. ఈ రోడ్డులో 1,300 వృక్షాలున్నాయి. చెట్ల తొలగింపునకు కాంట్రాక్టర్ అటవీశాఖ అనుమతి కోరగా ఒక్కోచెట్టుకు రూ.500 పరిహారం చెల్లించాలని అధికారులు సూచించారు. మొత్తం చెట్లకు రూ.6.69లక్షలు అటవీ శాఖకు చెల్లించినట్లు కాంట్రాక్టర్ రాజేశ్‌రెడ్డి వెల్లడించారు. దీంతో చెట్ల తొలగిస్తున్నామని చెప్పాడు. దీంతో కాశీంపూర్ వద్ద నేలవాలిన చెట్లతో రోడ్డు బోసిపోయింది.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

వికారాబాద్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్లు వెంటనే విడుదల చేయాలని వికారాబాద్‌లో విద్యార్థులు ఆందోళన చేస్తున్నారు. తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులు వికారాబాద్‌లో ర్యాలీ నిర్వహించి ఆర్డీవో ఆఫీసు వద్ద ధర్నా చేసి ఆర్డీవోకు వినతిపత్రం ఇచ్చారు. విద్యార్థులకు బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్, బీజేపీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ వడ్ల నందు మద్దతు తెలిపారు.

ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి

మేడ్చల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి అదనపు కలెక్టర్ రాధికగుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. మొత్తం 113 దరఖాస్తులను స్వీకరించారు.

అదనపు కలెక్టర్‌ను కలిసిన 'డబుల్' ఇళ్ల లబ్ధిదారులు

కీసర రూరల్: దమ్మాయిగూడ మున్సిపాలిటీ అహ్మద్‌గూడలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయంలో నెలకొన్న సమస్యల పరిష్కారంలో చొరవచూపారని కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ రాధికగుప్తాకు ఇళ్ల లబ్ధిదారులు ధన్యవాదాలు తెలిపారు. వారంతా కలెక్టరేట్‌కు వచ్చి రాధికగుప్తకు పుష్పగుచ్ఛం అందజేశారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): సింగరేణి రిటైర్డు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ది సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి అళవందార్ వేణు మాదవ్ అన్నారు. పోచారం పరిధి సుప్రభాత్ టౌన్షిప్‌లో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. కోల్‌మైన్స్ పెన్షన్-1998 ప్రకారం కనీస పెన్షన్‌ను పెంచాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు రాజయ్య, బీరయ్య, లక్ష్మీనారాయణ, కనకయ్య, పూర్ణప్రకాశ్, మల్లయ్య, నర్సయ్య, ప్రతాప్‌సింగ్, రామరాజు, రఫీక్, ప్రభాకర్ పాల్గొన్నారు.

పూడూరులో గంగమ్మకు పూజలు

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రామ చెరువులు నిండి అలుగు పారుతున్నందున గ్రామాల్లోని చెరువుల వద్ద స్థానికులు గంగమ్మ పూజలు చేస్తున్నారు. మేడ్చల్ మునిసిపాలిటీ పరిధి పూడూరులో ప్రజలు సోమవారం చెరువు వద్ద పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, రజలకులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు మోక్షం

- స్పందించిన కాంట్రాక్టర్.. ఊపందుకున్న బీటీ పనులు
- సమస్యపై ఆంధ్రజ్యోతి కథనం
- అధికారులపై మంత్రి, ఎమ్మెల్యే సీరియస్

తాండూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): తాండూరు-వికారాబాద్ రోడ్డులో కొన్ని నెలల క్రితం రోడ్డును తవ్వి కంకర వేసి వదిలేశారు. ఈ విషయమై ఆంధ్రజ్యోతి కథనం ప్రచురితమైంది. ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులపై సీరియసయ్యారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో రోడ్డు పనులను సోమవారం ప్రారంభించారు. ఇప్పటికే అగ్గనూర్-బషీరాబాద్, మైల్వార్ పనులు కొనసాగుతున్నాయి. త్వరలో తాండూరు-కోట్‌పల్లి రోడ్డు పనులు సైతం ప్రారంభించనున్నారు.

రోడ్ల మరమ్మతులకు రూ.50లక్షలు మంజూరు

ఇటీవల వర్షాలకు పాడైన ఆర్అండ్‌బీ రోడ్ల పనులకు రూ.50లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో తాండూరు, బషీరాబాద్, యలాల, పెద్దేముల్ మండలాల్లో రోడ్ల మరమ్మతులు చేపడుతున్నారు. అధికారులు ఎస్టిమేట్లు పూర్తిచేసి టెండర్లు కాల్‌ఫర్ చేస్తారు. ప్రజల ఇబ్బందుల దృష్ట్యా సత్వరమే పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు.



తాండూరు-వికారాబాద్ రోడ్డులో జరుగుతున్న పనులు

తూంకుంట జలమయం

- కాలనీలు, లోతట్టు ప్రాంతాలకు భారీగా వరద
- రాజీవ్ హైవే, ఆర్అండ్‌బీ రోడ్లపై నీటి ప్రవాహం

శామీర్‌పేట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): భారీ వర్షంతో తూంకుంట మునిసిపాలిటీలో రోడ్లు, కాలనీలు, స్కూల్ క్యాంపస్‌లు, రాజీవ్ హైవే జలమయమయ్యాయి. వాహనాల రాకపోకలు స్తంభించాయి. ఆదివారం రాత్రి శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపల్ ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. సోమవారం ఉదయం సైతం చాలా చోట్ల వరద ప్రవహించింది. లోతట్టు ఇళ్లలో నీరు చేరింది. దొంగల మైసమ్మ సమీప ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వద్ద రెండుఫీట్ల ఎత్తున వరద చేరింది. మండలంలోని పలుచోట్ల రాజీవ్ హైవేపై నీరు పారి మధ్యాహ్నం వరకు వాహనాలు, ప్రజల రాకపోకలకు ఇబ్బందులేర్పడ్డాయి.



దొంగల మైసమ్మ వద్ద నీట మునిగిన రాజీవ్ రహదారి

శామీర్‌పేటలోని గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రాంగణమంతా జలమయమైంది. తూంకుంటలో డబుల్‌బెడ్ రూమ్ అపార్ట్‌మెంట్ల వద్ద చెరువును తలపించింది. దాదాపు 42ఏళ్ల తర్వాత పోతాయిపల్లి చెరువు నిండి మత్తడి పొంగి రోడ్డుపై వరద పారింది. సమీప ఎంఎం రెడ్డి కాలనీలోకి వరద చేరింది. దేవరయంజాల్ పరిధి మహాలక్ష్మి వెంచర్ జలమయమయింది. దేవరయంజాల్-కొంపల్లికి ఆర్అండ్‌బీ రోడ్డుపై మూడుఫీట్ల ఎత్తున నీరు ప్రవహించింది. తూంకుంట మునిసిపాలిటీలో జలమయమైన ప్రాంతాలను, రోడ్లను కమిషనర్ జ్యోతి పరిశీలించారు. సిబ్బందితో నీటిని తొలగింపజేసి సమస్యలు పరిష్కరించారు.



వదర నీరు చేరిన పల్లవి స్కూల్ ప్రాంతం

అన్ని రంగాల్లో ప్రభుత్వం విఫలం

- మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి

ఘట్‌కేసర్, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు మాయ మాటలు చెప్పి గెలవగానే హామీలను విస్మరించి ప్రభుత్వం మోసగించిందని, అన్ని రంగాల్లో ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఘట్‌కేసర్‌లోని తహసీల్దార్ కార్యాలయం వద్ద రుణ మాఫీ కోసం చేపట్టిన రిలే నిరాహార దీక్ష శిబిరంను సందర్శించి మద్దుతు ప్రకటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీసం రైతులకు ప్రభుత్వం యూరియాను అందించలేకపోతున్నదని ఆరోపించారు. ఎరువుల కోసం రైతులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని విద్యార్థులు ఆందోళన బాటపట్టారని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులకు రుణమాఫీ చేసి ఘట్‌కేసర్ రైతులకు ఎందుకు చేయడం లేదని మండిపడ్డారు. ఈ విషయమై ముఖ్యమంత్రితో పాటు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కాగా, సమావేశంలో బీజేపీ నాయకులు మాట్లాడుతూ గతంలో కేసీఆర్ ప్రభుత్వం సైతం రైతులను మోసం చేసిందని ఆరోపించడంతో సమావేశంలో గందరగోళం ఏర్పడింది. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, రామోజీ, కొండల్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, మహేంద్రచారి రైతులు, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో మాట్లాడుతున్న మల్లారెడ్డి

ఉబికి వస్తున్న గంగ



భారీ వర్షాల నేపథ్యంలో చేవెళ్ల మండలంలోని వాగులు, కుంటలు, చెక్‌డ్యాంలు నిండాయి. భూగర్భ జలమట్టాలు పెరుగుతూ పాతాళ గంగపైకి వస్తోంది. చేవెళ్ల పరిధి మల్కాపూర్‌లో రైతు గండు రాంచంద్రయ్య పొలంలోని బోరు నుంచి కొద్ది రోజులుగా నీరు ఉబికివస్తోంది. బోరు మోటర్ ఆన్ చేయకుండానే కేసింగ్ నుంచి నీరు వస్తోందని రైతు ఆనందం వ్యక్తం చేస్తున్నాడు. గ్రామంలో మరి కొన్ని బోర్ల నుంచి కూడా నీరు పొంగుతోందని గ్రామస్తులు తెలిపారు.

- చేవెళ్ల, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి)

రేపు వికారాబాద్‌లో మెగా హెల్త్ క్యాంప్

- డీఎంహెచ్‌వో లలితాదేవి

వికారాబాద్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): వికారాబాద్‌లో సెప్టెంబరు 17న మెగా హెల్త్ క్యాంప్‌ను నిర్వహిస్తామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి లలితాదేవి తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో 'స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్'పై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. అక్టోబరు 2 వరకు జిల్లాలో మహిళల ఆరోగ్య క్యాంప్‌లు నిర్వహిస్తామని తెలిపారు. జూమ్ ద్వారా రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ జిల్లాల అధికారులతో సమీక్ష నిర్వహించి, క్యాంపుల్లో మహిళల ఆరోగ్య సమస్యల పరిష్కారంపై ప్రత్యేకదృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజ్యలక్ష్మి, డీసీహెచ్ఎస్ ఆనంద్, తాండూరు జిల్లాసుపత్రి, కొడంగల్ ఆసుపత్రుల సూపరింటెండెంట్లు మాలతి, సునీత, డిప్యూటీ డీఎంహెచ్‌వో రవీంద్రయాదవ్, వైద్యులు పవిత్ర, బీబీ జానీ, బుచ్చిబాబు, గోపాల్, నిరోషా, ప్రవీణ్, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి, డిప్యూటీ డెమో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన భూ నిర్వాసితులు



ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డిని కలిసిన ట్రిపుల్‌ఆర్ బాధితులు

పూడూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి):మండలంలోని పలు గ్రామాల్లో ట్రిపుల్‌ఆర్‌కు భూములు కోల్పోతున్న రైతులు సోమవారం చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని కలిసి గోడు వెళ్లబోసుకున్నారు. మొదట రూపొందించిన అలైన్మెంట్ ప్రకారమే రీజినల్ రింగ్ రోడ్డును నిర్మించాలని కోరారు. ఎంపీ స్పందిస్తూ.. సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని రైతులు తెలిపారు. అలాగే హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కోదండరాంను కూడా రైతులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.

ప్రజల ఆరోగ్య రక్షణే ధ్యేయం

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్/నందిగామ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యమే ధ్యేయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. లిమ్స్ ఆస్పత్రి యాజమాన్యం సుమారు రూ.60లక్షలు విలువ చేసే నాలుగు అత్యాధునిక అంబులెన్స్‌లను షాద్‌నగర్ నియోజకవర్గానికి అందజేసిందని తెలిపారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ అంబులెన్స్‌ల సమస్యను అధిగమించడానికే లిమ్స్ ఆస్పత్రి సహకారంతో మరో నాలుగు అంబులెన్స్‌లను అందుబాటులోకి తెచ్చామన్నారు. ఫరూఖ్‌నగర్, కేశంపేట మండలాలకు కలిపి రెండు అంబులెన్స్‌లు, కొత్తూరు - నందిగామ, కొందుర్గు - చౌదరిగూడ మండలాలకు రెండు అంబులెన్స్‌లను అందజేయనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, కమ్యూనిటీ ఆసుపత్రి సూపరింటెండెంట్ విష్ణువర్ధన్, హెల్త్ ఎడ్యూకేటర్ శ్రీనివాస్, నాయకులు రఘునాయక్, బాలరాజు గౌడ్, అగ్గనూరు బస్వం తదితరులు పాల్గొన్నారు. అలాగే నందిగామ మండల కేంద్రంలోని అయ్యప్ప దేవాలయం పునర్‌నిర్మాణంలో భాగంగా అయ్యప్ప, గణపతి, మాలికాపురోత్తమ అమ్మవార్ల మండపాలు నూతనంగా నిర్మించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీకారం చుట్టారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగ నర్సింహులు, దేవాలయ కమిటీ అధ్యక్షుడు జిల్లెల్ల బాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

లాల్‌కృష్ణకు నామినేటెడ్ పదవి?

- అధిష్ఠానానికి ఎమ్మెల్యే సిఫారసు లేఖ
- గతంలోనూ సీఎంతో సత్సంబంధాలు
- బీసీ నేతగా పట్టున్న లాల్‌కృష్ణ



లాల్‌కృష్ణ

పరిగి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పరిగి పట్టణానికి చెందిన డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణ ప్రసాద్ రాష్ట్రస్థాయి ప్రభుత్వ నామినేటెడ్ పదవిని ఆశిస్తున్నారు. ఆయన కాంగ్రెస్ ముఖ్య నాయకుడిగానే కాక బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్‌గా కొనసాగుతున్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న కార్పొరేషన్ల చైర్‌పర్సన్ లేదా డైరెక్టర్ పోస్టులో ఆయనకు అవకాశం ఇస్తారని స్థానికంగా చర్చ నడుస్తోంది. పరిగి నియోజకవర్గం నుంచి ఇప్పటి వరకు రాష్ట్రస్థాయి పదవుల్లో బీసీలకు పదవి దక్కలేదు. ఈ అంశం లాల్‌కృష్ణప్రసాద్‌కు కలిసొచ్చే అంశం. ఆయనకు రాష్ట్రస్థాయి పదవివ్వాలని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి సైతం పార్టీ అధిష్ఠానానికి లేఖ రాశారు. లాల్‌కృష్ణ గతంలో టీడీపీ తెలుగు యువత జిల్లా అధ్యక్షుడిగా, పరిగి తాలుకా టీడీపీ ఇన్‌చార్జిగా పనిచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి టీడీపీలో ఉన్న సమయంలో ఆయనతో కలిసి పాదయాత్రలో పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా పార్టీ కార్యక్రమాలు నిర్వహించారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. కాంగ్రెస్‌లో బీసీ నేతగా గుర్తింపు పొందారు. త్వరలో నామినేటెడ్ పదవులను భర్తీచేస్తారన్న వార్తల నేపథ్యంలో లాల్‌కృష్ణ సైతం ప్రధాన కంటెండర్‌గా ఉన్నారు. ప్రభుత్వ నామినేటెడ్ పదవి రాకుంటే డీసీసీ అధ్యక్షుడిగానైనా నియమించాలని ఆయన పార్టీని కోరుతున్నాడు. పార్టీ పదవి బీసీలకిస్తే లాల్‌కృష్ణ పేరు ప్రధానంగా పరిశీలిస్తారని పార్టీ శ్రేణులు సైతం చర్చించుకుంటున్నాయి.

ప్రజల ఆకాంక్షల మేరకు పథకాలు

ఆమనగల్లు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలో ప్రతి కుటుంబానికి మేలు జరుగుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల మండలాల్లో సోమవారం ఎమ్మెల్యే పర్యటించారు. నాగిళ్లలో రూ.10లక్షలతో చేపట్టే డ్రెయిన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. జెడ్పీ పాఠశాలలో నిర్మించిన మరుగుదొడ్లు, మూత్రశాలలను, ఆవురుపల్లిలో కంఠమహేశ్వరస్వామి ఆలయం వద్ద కొత్తగా వేసిన బోరు మోటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. వివిధ గ్రామాల లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో నారాయణరెడ్డి మాట్లాడుతూ.. గ్రామాలు, తండాల ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తున్నట్టు తెలిపారు. విద్యారంగానికి పెద్దపీట వేస్తూ కార్పొరేట్ స్థాయాల్లో స్కూళ్లు, కాలేజీలను తీర్చిదిద్దుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో వేజన్న, తహసీల్దార్ వినయ్‌సాగర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భట్టు కిషన్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, యాదయ్య గౌడ్, వెంకటేశ్వర్లుగౌడ్, సంపత్‌కుమార్, జగన్, రఘురాములు, పెంటారెడ్డి, అశోక్‌రెడ్డి, సురేందర్ రెడ్డి, లాలయ్యగౌడ్, నర్సింహాగౌడ్, విజయమ్మ, వెంకట్‌రెడ్డి, యాదయ్యగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణయ్యగౌడ్, రవికుమార్‌గౌడ్, బొజ్జ సాయిరెడ్డి, హరిమోహన్‌గౌడ్, పాండుగౌడ్, పి.జంగయ్య, సూదిని కొండల్‌రెడ్డి, మల్లేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

గ్రామాల్లో వసతుల కల్పనే లక్ష్యం

మాడ్గుల: గ్రామాల్లో వసతుల కల్పనే లక్ష్యమని ఎమ్మెల్యే నారాయణరెడ్డి అన్నారు. నాగిళ్లలోని ఎస్సీ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. పాఠశాలలో విద్యార్థులతో సమావేశమయ్యారు.

సమాజ అభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర గొప్పది

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సమాజ అభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర ఎంతో గొప్పదని వాసవి క్లబ్ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు దొంతు పాండురంగయ్య అన్నారు. షాద్‌నగర్‌లోని కన్యక పరమేశ్వరి ఆలయంలో సోమవారం వాసవి క్లబ్ అధ్యక్షుడు కల్వ మాణిక్యం, వాసవి వనితా క్లబ్ అధ్యక్షురాలు కల్వ మధుప్రియల సంయుక్త ఆధ్వర్యంలో ఇంజినీర్స్ డేను జరుపుకున్నారు. ఆర్య వైశ్య ఇంజినీర్లను సన్మానించారు. ఇంజనీర్లు మేధస్సును వినియోగించి, అంకిత భావంతో పనిచేస్తే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో క్లబ్ నాయకులు సురేష్‌కుమార్, జి.వెంకటరమణ, జి.సత్యనారాయణ, సంఘం నాయకులు శ్రీనివాస్, పెద్ది రామ్మోహన్, వి.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఏబీవీపీ శంషాబాద్ విభాగ్ హాస్టల్స్ కన్వీనర్‌గా జ్యోతిప్రసాద్



కందుకూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాచులూరుకు చెందిన దంతోజు జ్యోతిప్రసాద్ ఏబీవీపీ శంషాబాద్ విభాగ్ హాస్టల్స్ కన్వీనర్‌గా ఎన్నికయ్యారు. ఈ నెల 13, 14 తేదిల్లో షాద్‌నగర్‌లో ఠాగూరు స్కూల్ ఆడిటోరియంలో నిర్వహించిన ఏబీవీపీ అభ్యాస వర్గ నిర్వహించారు. ఈ సంద ర్భంగా జ్యోతిప్రసాద్‌ను హాస్టళ్ల కన్వీనర్‌గా ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ అందుబా టులో ఉంటూ సేవలందిస్తానని చెప్పారు.

తల్లిదండ్రులు మాట్లాడటంలేదని కుమార్తె ఆత్మహత్య

బీబీనగర్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు మందలించి, మాట్లాడడం మానేశారని మనస్తాపానికి గురైన ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన ఆదివారం యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలం వెంకిర్యాలలో జరిగింది. సీఐ ప్రభాకర్ రెడ్డి, గ్రామస్థులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకిర్యాలకు చెందిన మార్త రమేష్ ఆర్టీసీ డ్రైవర్. అతడికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తె శ్రీవెన్నెల(17) తార్నాకలోని రైల్వే జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతోంది. నాలుగు రోజుల కిందట ఇంటికి ఆలస్యంగా రావడం, ఫోన్ చేసినా ఎత్తకపోవడంతో తండ్రి రమేష్ కుమార్తెను తీవ్రస్థాయిలో మందలించారు. అంతేకాకుండా ఇంట్లో ఎవరూ శ్రీవెన్నెలతో సరిగా మాట్లాడడం లేదు. ఈ నేపథ్యంలో ఆదివారం బంధువుల ఇంట్లో శుభకార్యం ఉండడంతో తల్లిదండ్రులు శ్రీవెన్నెలను ఇంట్లోనే ఉంచి మరో కుమార్తె, కుమారుడితో కలిసి వెళ్లారు. సాయంత్రం తల్లిదండ్రులు ఇంటికి వచ్చే సరికి శ్రీవెన్నెల ఇంట్లో ఉరేసుకొని చనిపోయింది. రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ తెలిపారు.

విరమణ ఉద్యోగానికే.. సేవలకు కాదు

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విరమణ అనేది ఉద్యోగానికే గానీ సామాజిక సేవలకు కాదని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద పాఠశాలలో పనిచేసిన ఎస్. జనార్ధన్‌రెడ్డి రిటైర్మెంట్ సన్మాన కార్యక్రమం సోమవారం ఠాగూర్ ఫంక్షన్‌హాలులో జరిగింది. ఎమ్మెల్సీలు ఏవిఎన్‌రెడ్డి, నాగరకుంట నవీన్‌కుమార్‌రెడ్డిలు హాజరై జనార్ధన్‌రెడ్డి దంపతులను సన్మానించి అభినందించారు. వారు మాట్లాడుతూ.. ప్రతి ఉద్యోగికి 60సంవత్సరాలు పూర్తికాగానే ఉద్యోగ విరమణ ఉంటుందని, అంత మాత్రాన జీవితం అయిపోదన్నారు. ఆరోగ్యాన్ని, శారీరకశక్తిని కాపాడుకుంటూ సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. హెచ్ఎం కె.శేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో షాద్‌నగర్ గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కె.మదన్‌మోహన్ రెడ్డి, తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హన్మంతరావు, ప్రధాన కార్యదర్శి సురేష్, జిల్లా అధ్యక్షుడు కాశీరావు, బీజేపీ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, కె.రాజీవ్‌రెడ్డి, వెంకటేష్ గుప్తా, కె.మనోహర్‌రెడ్డి, టీచర్లు పాల్గొన్నారు.

క్లస్టర్లలో జీపీవోల నియామకం

కేశంపేట/కొందుర్గు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రామ పాలన అధికారులు(జీపీవో) విధుల్లో చేరారు. సోమవారం కేశంపేట మండలంలో 11 క్లస్టర్లలో తొమ్మిది మంది జీపీవోలు జాయినయ్యారు. తమ అపాయింట్‌మెంట్ ఆర్డర్లను తహసీల్దార్ ఆజం అలీకి అందించారు. ఇప్పలపల్లి క్లస్టర్‌కు రాజేశ్వరి, లేమామిడికి హేమలత, నిర్దవెల్లికి వెంకటయ్య, కేశంపేటకు శంకర్, వేములనర్వకు విజయలక్ష్మి, తొమ్మిదిరేకులకు కృష్ణయ్య, సంతాపూర్‌నకు గిరీష్‌కుమార్, కొత్తపేటకు పెంటయ్య, అల్వాలకు సేవ్యా నాయక్, సంగెంకు లింగమూర్తి నియామకం అయ్యారని తహసీల్దార్ తెలిపారు. కొందుర్గు మండలానికి తొమ్మిది మంది జీపీవోలు వచ్చారని డిప్యూటీ తహసీల్దార్ రాకేశ్ తెలిపారు. వీరు గత వీఆర్వోల స్థానాల్లో గ్రామ పాలన అధికారులుగా విధులు నిర్వహిస్తారని తెలిపారు.

ప్రమాదకరంగా కల్వర్టు



నాగారం- అన్నారం రోడ్డు మార్గంలో ప్రమాదకరంగా కల్వర్టు

కొడంగల్ రూరల్, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): నాగారం- అన్నారం గ్రామాల మధ్య ఉన్న రోడ్డులో కల్వర్టు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఈ రోడ్డు మార్గం గుండా అధిక లోడుతో వాహనాలు వెళ్లడంతో కల్వర్టు ఒక వైపు కూలిపోయింది. మరోవైపు సిమెంట్ పెచ్చులు తేలి ప్రమాదకరంగా మారింది. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే నూతన కల్వర్టు నిర్మించాలని కోరుతున్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

బొంరాస్‌పేట్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని జీహెచ్‌ఎం హరిలాల్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులతో హౌస్ కమిటీని ఏర్పాటు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రశాంత్‌కుమార్, చంద్రశేఖర్, మల్లయ్య, అనిల్‌కుమార్, హరికాంత్, ఏజాజ్‌అహ్మద్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న షీటీమ్ నిర్వాహకులు

వికారాబాద్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై విద్యార్థులకు అవగాహన అవసరమని షీటీమ్ ఇన్‌చార్జి బుచేందర్ రెడ్డి అన్నారు. కొంపల్లి పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం షీ టీమ్ నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. విద్యార్థులు అవసరమైనప్పుడు వెంటనే 181కు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ నిర్వాహకులు రేష్మ, రవీందర్ పాల్గొన్నారు.

తప్పనున్న ట్రాఫిక్ తిప్పలు



ఎన్టీఆర్ విగ్రహాన్ని పక్కకు తరలిస్తున్న సిబ్బంది

వికారాబాద్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ పట్టణంలో ప్రధాన చౌరస్తా అయినా ఎన్టీఆర్ చౌరస్తాలో ట్రాఫిక్ తిప్పలు తీరనున్నాయి. ఎన్టీఆర్ విగ్రహాన్ని కొంత పక్కకు జరిపి మధ్యలో ఉన్న కట్టను అధికారులు తొలగిస్తున్నారు. దీంతో రోడ్డు విస్తీర్ణం పెరిగి ట్రాఫిక్ సమస్యలు తీరనున్నాయి. సోమవారం విగ్రహాన్ని తొలగించే పనులు కొనసాగాయి.

కరాటే పోటీల్లో పరిగి విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు

పరిగి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో పరిగి విద్యార్థులు ప్రతిభను చాటారు. వీరజవాన్ మురళి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో షాద్‌నగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో పరిగి నుంచి పాల్గొని ప్రతిభను చాటి బంగారు,వెండి పథకాలను సాధించారు. అండర్-12 బాలికల విభాగంలో తపస్సుబేగం బంగారుపతకం, అండర్-12 బాలుర విభాగంలో హసల్‌ఖాన్ అఖిల్ బంగారుపతకం, మోక్షిత్ వెండి పతకాలు సాధించారు. వీరిని కరాటే మాస్టర్ ఎండీ గౌస్, ఆల్‌ఇండియా స్టైల్‌చీఫ్ కృష్ణయ్య, తెలంగాణ చీఫ్ ఇలియాస్‌బిల్ సిద్దిఖీ,క్లబ్ ఇన్‌స్పెక్టర్ నిల్వానాయక్‌లు అభినందించారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు మేలు

మోమిన్‌పేట్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు ఎంతో మేలు చేకూరుతోందని మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని 20 మంది లబ్ధిదారులకు సోమవారం రూ.10లక్షలా 37వేలు విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మన్నె శంకర్‌యాదవ్, నాయకులు సుభాష్‌గౌడ్, సురేందర్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

యాలాల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో వారం రోజులుగా మిషన్ భగీరథ నీరు సరఫరా కాక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారంజరిగిన ప్రజావాణిలో కేవీపీఎస్, ప్రజాసంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల నాయకులు మెట్టి కృష్ణ, మలిగేరి నర్సింహులు, హెచ్.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలో తాగునీటి సమస్య లేదు

బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఏ ఒక్క గ్రామంలో కూడా తాగునీటి సమస్య తలెత్తలేదని బీఆర్ఎస్ యాలాల మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు కనీసం తాగునీరు అందించలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం కొట్టుమిట్టాడుతోందని విమర్శించారు. సమస్య తీర్చకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ప్రభుత్వ భూమి కబ్జాపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ధారూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్టేషన్ ధారూరు రెవెన్యూ పరిధిలోని సర్వేనంబరు 384, 386లో ప్రభుత్వ భూమిని కబ్జాచేసి అక్రమ నిర్మాణాలు చేపట్టారని మాజీ సర్పంచ్ తిరుపతయ్య, మాజీ ఉపసర్పంచ్ యాదయ్యలు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వభూమిలో 10ఎకరాలు ఇద్దరు వ్యక్తులు కంచె వేసి కబ్జాచేశారని ఆరోపించారు.

పింఛన్లు పెంచే వరకూ పోరాటం



వికారాబాద్: పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



తాండూరు రూరల్: తాండూరు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

వికారాబాద్/కులకచర్ల/తాండూరు రూరల్/చౌడాపూర్/పెద్దేముల్/యాలాల/పరిగి/దోమ/ఘట్‌కేసర్ రూరల్/కీసర, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పింఛన్లు పెంచే వరకూ పోరాటం సాగిస్తామని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. వికారాబాద్‌లో సోమవారం ర్యాలీ నిర్వహించి ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు పెన్షన్లు పెంచాలని డిమాండ్ చేశారు. కులకచర్ల తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మార్పీఎస్ నాయకులు డిప్యూటీ తహసీల్దార్‌కు పింఛన్‌దారులతో కలిసి వినతిపత్రం అందించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు మొగులయ్య, శివాజీ పాల్గొన్నారు. తాండూరులో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మండల ఇన్‌చార్జి నర్సింహులు తాండూరు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బలరాం మాదిగ, రవి మాదిగ, సుందర్ మాదిగ, చందు, గజలప్ప, రాజాసింగ్, నారాయణ రెడ్డి ఉన్నారు. అదేవిధంగా చౌడాపూర్ మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మొగులన్న, అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు పరిగి అశోక్ తదితరులు పింఛన్ పెంపునకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా పెద్దేముల్‌లో తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ఎమ్మార్పీఎస్, వికలాంగుల హక్కుల పోరాటసమితి, చేయూత పెన్షన్ దారుల హక్కుల పోరాటసమితి ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సిములు మాదిగ తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా ఎమ్మార్పీఎస్ వికలాంగుల హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడు సూర్య ప్రకాష్ యాలాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందజేశారు. పరిగిలో ఎమ్మార్పీఎస్ పరిగి ఇన్‌చార్జి జి.రవికుమార్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో వికలాంగుల సంఘం పరిగి తాలుకా అధ్యక్షుడు సురేష్, నాయకులు లాజరస్, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఎమ్మార్పీఎస్, దివ్యాంగుల హక్కుల పోరాటసమితి ఆధ్వర్యంలో ఘట్‌కేసర్ తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. ఈ కార్యక్రమంలో ప్రణయ్, సగ్గు శివ, ఉపేందర్‌రెడ్డి, బాలనర్సింహ్మ, అంజి, గణేష్, వంశీ, సాయిలు తదితరులు పాల్గొన్నారు. కీసర తహసీల్దారు కార్యాలయంలో ఎమ్మార్పీఎస్, వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు డిప్యూటీ తహసీల్దారు అశ్విన్‌కు వినతి ప్రతం అందజేశారు. దోమ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి డిప్యూటీ తహసీల్దార్ నర్సిములుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బందెయ్య, వెంకటేశ్, ఆంజనేయులుయాదవ్ పాల్గొన్నారు.



ఘట్‌కేసర్ రూరల్: ధర్నా చేస్తున్న దివ్యాంగులు

మధ్యాహ్న భోజనం ఉత్తిమాటేనా?

(ఐదో పేజీ తరువాయి)

అలమటించే విద్యార్థులు అధ్యాపకులు చెప్పే పాఠాలను సక్రమంగా అర్థం చేసుకోలేకపోతున్నారు. అంతే కాకుండా ఎదిగే వయస్సుకు సరిపడా పోషకాలు పొందక శారీరకంగా, మానసికంగా బలహీనంగా మారుతున్నారు.

ఏటేటా తగ్గుతున్న విద్యార్థులు

గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేసేందుకు ఎంత ఖర్చవుతుందనే వివరాలు సేకరించినా కార్యరూపం దాల్చలేదు. జూనియర్, మోడల్ కళాశాలల్లోని ఇంటర్, డిగ్రీ, డీఎడ్, బీఎడ్, డీఎడ్, పాలిటెక్నిక్, ఐటీఐ/ఐటీసీ కళాశాలల్లో చ దువుతున్న విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలనే డిమాండ్ చాలా కాలంగా ఉంది. వీరిలో ప్రభుత్వ జూనియర్, మోడల్, డిగ్రీ, పాలిటెక్నిక్, డైట్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ఉంటారు. ఏటేటా తగ్గిపోతున్న విద్యార్థుల సంఖ్యను పెంచడానికి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేస్తామని గత బీఆర్ఎస్ ప్రభుత్వం హామీ ఇచ్చినా అమలుకు నోచుకోలేదు. విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనైనా ఈ పథకం అమలు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

పలువురు స్నాక్స్‌తోనే సరి

ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో చాలా వరకు పేద విద్యార్థులు ఉన్నారు. కొందరు విద్యార్థులు భోజనం చేసే సమయంలో కర్రీ పఫ్స్, సమోసా, స్నాక్స్, పండ్లు, టీ, కాఫీలతో తమ ఆకలిని కొంత వరకు తీర్చుకుంటున్నారు. ప్రభుత్వ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేస్తే ఎంతో మంది పేద విద్యార్థులకు ప్రయోజనం కలుగనుంది. ప్రభుత్వ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటే పేద విద్యార్థులకు ప్రయోజనం కలగడమే కాకుండా ప్రభుత్వ కళాశాలలకు మరింత ఆదరణ పెరిగి విద్యార్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి



ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వ కళాశాలల్లో కూడా అమలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు తాము బయలుదేరే సమయానికి ఇంట్లో భోజనం సిద్ధం అయితే భోజనం చేసి వస్తున్నారు. లేకపోతే అలాగే వచ్చేస్తున్నారు. ప్రభుత్వం ఈ పథకం అమలు చేస్తే పేద విద్యార్థుల ఆకలి తీరుతుంది. కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య కూడా పెరుగుతుంది.

- పల్లవి, బైపీసీ, ఇంటర్ సెకెండియర్, నవాబ్‌పేట్ జూనియర్ కళాశాల

యూరియా కోసం ధర్నా, రాస్తారోకో



రావుల్‌పల్లి రోడ్డుపై ధర్నా చేస్తున్న రైతులు

దౌల్తాబాద్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): దేవరఫస్లాబాద్ గ్రామంలో యూరియా కోసం సోమవారం రైతులు తెల్లవారుజాము నుంచి రైతు వేదిక ఎదుట బారులు తీరారు. వ్యవసాయ అధికారులు ఏఈవో నిఖిల్ అక్కడికి రావడంతో ఒక్కసారిగా ఆయనను తోసుకుంటూ ముందుకు వెళ్లారు. దీంతో రైతువేదికలో ఉన్న టీవీ కిందపడటంతో అధికారులు రైతు వేదికకు తాళం వేశారు. రావుల్‌పల్లి రోడ్డుపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. దీంతో రెండు గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని రైతులను సముదాయించి టోకెన్‌లు ఇప్పించారు.

పరిగి: పరిగిలోని ఆగ్రోస్ కేంద్రం వద్ద యూరియా బస్తాలు వచ్చాయని తెలుకున్న వందలాది మంది రైతులు సోమవారం అక్కడికి చేరుకున్నారు. గంటల తరబడి క్యూలైన్‌లలో నిలబడినా ఒక్కబస్తా కూడా లభించకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పెద్దేముల్: స్థానిక రైతుసేవ సహకార సంఘానికి ఆదివారం 400బస్తాల యూరియా వచ్చింది. విషయం తెలుసుకున్న రైతులు యూరియా కోసం సొసైటీ ముందు క్యూకట్టారు. తోపులాట జరగకుండా పోలీసుల సమక్షంలో పంపిణీ ప్రారంభించారు. అయినప్పటికీ కొంతమందికి యూరియా లభించక ఉత్తచేతులతోనే వెళ్లిపోయారు.

తాండూరు రూరల్: ఎల్మకన్నె సహకార సంఘం వద్ద యూరియా బస్తాల కోసం రైతులు సోమవారం బారులు తీరారు. 20టన్నుల(450బస్తాల) యూరియా పంపిణీ చేసినట్లు తాండూరు వ్యవసాయ శాఖ ఇన్‌చార్జి ఏడీఏ కొమరయ్య, సీఈవో శ్రీనివాస్, అడిషనల్ సీఈవో చంద్రారెడ్డి తెలిపారు.

ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే కుట్ర



బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

యాలాల/ తాండూరు/ బషీరాబాద్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని అంగన్‌వాడీ టీచర్లు ఆందోళన వ్యక్తం చేశారు. పీఎంశ్రీ, మొబైల్ అంగన్‌వాడీ కేంద్రాల ప్రతిపాదనను విరమించుకోవాలని కోరుతూ సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసనకు దిగారు. కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి ముట్టడికి తరలకుండా అంగన్‌వాడీ టీచర్లను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేశారు. సుమారు రెండు గంటల పాటు అంగన్‌వాడీ టీచర్లను పోలీసు స్టేషన్ ఆవరణలో కూర్చోబెట్టారు. సమస్యలపై పోరాటం చేస్తే అరెస్టులు చేస్తారా? అని అంగన్‌వాడీ వర్కర్స్ వెల్ఫేర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ టీచర్లకు మద్దతుగా యాలాల మండలం కేవీపీఎ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప కేవీపీఎస్ యాలాల మండల ఇన్చఆర్జీ నెత్తి నర్సింహులు మద్దతు తెలిపారు. తాండూరు పట్టణ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లను, తాండూరు మండలంలోని అంగన్‌వాడీ టీచర్లను సీఎం ఇంటి ముట్టడికి వెళ్లకుండా పోలీసులు ముందస్తుగానే అరెస్టు చేశారు. తాండూరు పట్టణ పోలీసులతోపాటు తాండూరు మండల పోలీసులు ముందస్తుగా వారిని అరెస్టు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ అంగన్‌వాడీ టీచర్లతోపాటు ఉపాధ్యక్షులు శ్రీనివాస్ తదితరులున్నారు. అదేవిధంగా తాండూరులో సీఐటీయూ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పోలీసులు జోక్యం చేసుకుని ముందస్తుగా పోలీసు స్టేషన్‌కు తరలించారు. బషీరాబాద్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు సోమవారం అంగన్‌వాడీ టీచర్లను పోలీసులు ముందస్తు ఆరెస్ట్ చేసి వాహనంలో బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. దీంతో సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసనకు దిగారు.

ఇంజనీర్ల మేధాశక్తితో అద్భుత ఫలితాలు

తాండూరు రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇంజనీర్లు తమ మేధాశక్తితో అద్భుత ఫలితాలు సాధించారని తాండూరు పంచాయతీరాజ్ ఈఈ సత్యనారాయణరెడ్డి అన్నారు. మండల పరిషత్ ఆవరణంలోని పంచాయతీరాజ్ కార్యాలయంలో సోమవారం మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అత్యుత్తమ ఇంజనీరింగ్ సాంకేతికతతో ఆయన చేసిన కృషి భారత ఇంజనీరింగ్ రంగానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈలు కృష్ణ జోషి, నాగభూషణం, ఏఈలు సంతోష్‌కుమార్, నందిని, గౌతం, వినోద్‌కుమార్, డీఏవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



మోక్ష గుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఈఈ

సంక్షిప్తంగా..

'అనురాగ్'లో ఉద్యోగ అవగాహన సదస్సు

ఘట్‌కేసర్ రూరల్: పోచారం మున్సిపాలిటీ, వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో సోమవారం వీఎల్ఎస్ఐ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించారు. సిలికాన్ మెటా సిస్టమ్స్ ప్రతినిధి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ విజయ్‌కుమార్, అధ్యాపకులు రామకృష్ణ, అమృత తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్ కూల్చిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి

కోట్‌పల్లి: బార్వాద్ తండాలో శనివారం రాత్రి ప్రధాన రోడ్డుపై ఉన్న బస్టాండ్‌ను కూల్చిన గుర్తుతెలియని వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఘటనాస్థలాన్ని సోమవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు నర్సింగ్ నాయక్, నాయకులు మాట్లాడుతూ బస్టాండ్ కూల్చిన వ్యక్తులపై పోలీసులు, సంబంధించిన అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంచందర్ రెడ్డి (టిల్లు), నర్సిములు, రవీందర్ రెడ్డి, వెంకట్ రాంరెడ్డి, జగన్నాథ్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

కులకచర్ల: స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు కరణం ప్రహ్లాద్ రావు అన్నారు. పుట్టపహాడ్ గ్రామంలో సోమవారం బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కృష్ణయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు వెంకటయ్యగౌడ్, జానకిరామ్, బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటయ్య, షైపాల్, చంద్రలింగం పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వంలోనే గ్రామాల అభివృద్ధి

కులకచర్ల: ప్రజా ప్రభుత్వంలోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్‌కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు అన్నారు. ముజాహిద్‌పూర్ గ్రామంలో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముగ్గు పోసి లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పంపిణీ చేశారు.

ఆలయాల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కృషి

కులకచర్ల: ఆలయాల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం ఎంతో కృషిచేస్తుందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి అన్నారు. బిందెం గడ్డ తండాలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి సోమవారం నూతన కమిటీని ఏర్పాటు చేశారు.

పాఠశాలకు టీవీ అందజేత

దోమ: బడెంపల్లి ప్రాథమిక పాఠశాలలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వెంకటేశ్, ఆర్టీవో ఉద్యోగం చేస్తున్న అశోక్ తమ గ్రామ పాఠశాలలో సోమవారం రూ.25వేలు విలువ గల టీవీ అందజేశారు. అదేవిధంగా ఉపాధ్యాయుడు దశరథ్ రూ.5వేలతో కొనుగోలు చేసిన టై, బెల్టులు, ఐడీ కార్డులను విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శ్రీనివాస్ వారిని సన్మానించి అభినందించారు.

క్రైం కార్నర్

చేపల వేటకు వెళ్లి యువకుడి మృతి

శామీర్‌పేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : చెరువులో చేపలు పట్టడానికి వెళ్లిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు ఆ చెరువు నీటిలో మునిగి సోమవారం మృతిచెందాడు. స్థానికుల, బాధితుల, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జవహర్ నగర్ ప్రాంతానికి చెందిన వల్లపు హనుమయ్య(28) అనే యువకుడు తన స్నేహితులతో కలిసి సోమవారం మధ్యాహ్నం 3గంటలకు శామీర్‌పేట మండలం తూంకుంట పరిధిలోని నల్లకుంట చెరువులో చేపలు పట్టడానికి వచ్చారు. కాగా యువకుడు హనుమయ్య చేపల కోసం ఆచెరువు నీటిలో దిగగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగి గల్లంతయ్యాడు. ఈ విషయాన్ని స్నేహితులు, స్థానికులు పోలీసులకు సమాచామిచ్చారు. దీంతో సాయంత్రం శామీర్‌పేట ఎస్‌ఐ శశివర్ధన్‌రెడ్డి, పెట్రోల్ మొబైల్ సిబ్బంది, ఫైర్ ఆఫీసర్ శివప్రసాద్‌లు చెరువు నీటిలో నుంచి హనుమయ్య మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం ఆ యువకుడు హనుమయ్య మృతదేహానికి పోలీసులు పంచనామా చేసి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు శామీర్‌పేట ఎస్‌ఐ శశివర్ధన్‌రెడ్డి తెలిపారు.

భవనంపై నుంచి దూకి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కీసర రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి భవనంపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. రవీందర్‌రెడ్డి అనే వ్యక్తి తన తల్లితండ్రులతో కలిసి దమ్మాయిగూడ మున్సిపాలిటీ రాజీవ్ గృహకల్ప కాలనీ(ఆర్జీకే)లో 108బ్లాకులో నివాసముంటున్నాడు. డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. కాగా రాత్రి ఇంట్లో తల్లితండ్రులతో వాగ్వాదం జరగడంతో మనస్తాపం చెందిన అతను నాలుగంతస్తుల భవనంపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేశాడు. తలకు తీవ్రగాయం కావటంతో అపస్మారకస్థితికి చేరుకున్నాడు. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది రవి సమయస్ఫూర్తితో అతడికి ప్రథమ చికిత్స చేశాడు. సకాలంలో గాంధీ ఆస్పత్రి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

డ్రైనేజీలోకి దూసుకెళ్లిన కారు

తాండూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇందిరాచౌక్‌లో నిర్మాణంలో ఉన్న డ్రైనేజీలోకి కారు దూసుకెళ్లింది. సోమవారం తెల్లవారుజామున కొడంగల్ రోడ్డు మార్గం నుంచి ఇందిరాచౌరస్తా వైపు వస్తున్న కారు అదుపుతప్పి డ్రైనేజీలోకి దూసుకెళ్లింది. కారులోఉన్న వారికి ఎలాంటి ప్రమాదం జరుగలేదు. జేసీబీ సాయంతో పోలీసులు, స్థానికులు కారును బయటికి తీశారు. డ్రైవర్ నిద్రమత్తు కారణంగా కారు అదుపు తప్పి డ్రైనేజీలోకి వెళ్లిందని స్థానికులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

యాలాల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నట్లు యలాల పోలీసులు తెలిపారు. ఆదివారం రాత్రి 2గంటలకు దేవనూరు వాగు నుంచి ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందించిందని తెలిపారు. ఈ మేరకు పోలీసు సిబ్బంది దుబ్బతండాకు వెళ్లి చూడగా, దేవనూరు వాగు నుంచి రెండు ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. డ్రైవర్లు శ్రీనివాస్, వర్త పవన్‌ల వద్ద అనుమతి పత్రాలు లేకపోవడంతో రెండు ట్రాక్టర్లను పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉపాధ్యాయులకు సన్మానం



మర్పల్లిలో సన్మానం పొందిన ఉత్తమ ఉపాధ్యాయులు

మర్పల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం మండలంలోని ఆయా పాఠశాలల్లో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటాలకు ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని 20మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో అంజిలయ్య, రెవెన్యూ అధికారులు, పట్లూర్, కల్కోడ పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

కోట్‌పల్లి: అన్ని వృత్తుల కన్నా ఉపాధ్యాయ వృత్తి గొప్పదని మండల విద్యాధికారి చంద్రప్ప అన్నారుఉపాధ్యాయుల దినోత్సవం మండల విద్యావనరుల కేంద్రంలో సోమవారం ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మండల విద్యాధికారి చంద్రప్ప మాట్లాడుతూ మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 11మంది ఉపాధ్యాయులను సన్మానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డానియల్, అరుణ్ కుమార్, రామకృష్ణ, షైపాల్‌రెడ్డి, శ్రీనివాస్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ టౌన్: పాఠశాలల్లో ఉత్తమ సేవలు అదిస్తున్న ఉపాధ్యాయులను ఎస్ఎస్ఆర్ జూనియర్ కళాశాల కరెస్పాండెంట్ నారెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శంకరయ్య, ఎస్ఎస్ఆర్ జూనియర్ కళాశాల కరస్పాండెంట్, చైర్మన్ నారెడ్డి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

జీపీ భవనాన్ని గ్రామస్తులకే కేటాయించాలి

శామీర్‌పేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని మజీద్‌పూర్ పంచాయతీ భవనాన్ని ఈఎస్ఐ డిస్పెన్సరీకి ఇవ్వకుండా గ్రామస్తులకే కేటాయించాలని ఆ గ్రామ నాయకులు కోరారు. కాంగ్రెస్ పార్టీ శామీర్‌పేట మండల ప్రధాన కార్యదర్శి తుంకి రమేశ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తుంకి భిక్షపతి, గ్రామ ఇతర నాయకులు సోమవారం కలెక్టరేట్‌కు వెళ్లి ప్రజావాణిలో అదనపు కలెక్టర్ రాధికగుప్తను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.

బతుకమ్మ చీరలు రెడీ

(ఐదో పేజీ తరువాయి)

చేరుకున్నాయి. జిల్లా పూర్తిగా పట్టణ ప్రాంతం కావడంతో మెప్మా ద్వారా మున్సిపాల్టీల్లోని సంఘాల పరిధిలోని సభ్యుల వివరాలు సేకరించారు.

నాలుగు రకాల డిజైన్లు

డ్వాక్రా మహిళలకు బతుకమ్మ పండుగ సందర్భంగా పంపిణీ చేయనున్న చీరలను ప్రభుత్వం నాలుగు డిజైన్లలో రూపొందించింది. మహిళలను ఆకట్టుకునేలా ప్రత్యేకమైన డిజైన్‌లను రూపొందించినట్లు సమాచారం. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పంపిణీ చేసిన చీరలపై అనేక విమర్శలు వెల్లువెత్తిన విషయం తెలిసిందే. వాటిని దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన చీరలను అందించాలనే ప్రభుత్వం చేనేత చీరలను నాలుగు డిజైన్‌లలో తయారు చేసినట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. మరో రెండు రోజుల్లో చీరల పంపిణీ షెడ్యూల్‌ను అధికారులు విడుదల చేయనున్నారు. ఇప్పటికే జిల్లాకు చేరుకున్న చీరలను నాలుగు ప్రాంతాల్లో గోదాములలో అధికారులు భద్రపరిచారు. త్వరలోనే చీరలపంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది.